నేడు ఎంకే రాముకు స్మారక సాంస్కృతిక పురస్కారం

చిక్కడపల్లి: ప్రముఖ కవి, రసమయి సాంస్కృతిక సంస్థ వ్యవస్థాపకుడు ఎంకే రాముకు కళా సుబ్బారావు స్మారక సాంస్కృతిక పురస్కారాన్ని ప్రదానం చేస్తున్నామని త్యాగరాయ గానసభ అధ్యక్షుడు జనార్ధనామూర్తి తెలిపారు. గురువారం ఆయన గానసభ ఆవరణలో విలేకరులతో మాట్లాడారు. ఈ శుక్రవారం సాయంత్రం 5గంటలకు త్యాగరాయ గానసభలో జరిగే సాంస్కృతిక అభిమాని, కళా పోషకుడు కళా సుబ్బారావు జయంతి కార్యక్రమంలో ప్రదానం చేస్తామన్నారు.

నేడు జాబ్ మేళా

విజయనగర్‌కాలనీ: హైదరాబాద్ జిల్లా ఉపాధి కల్పనా కార్యాలయంలో నేడు జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఉపాధి అధికారి నరపల్ సింగ్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. నగరంలోని ప్రముఖ ప్రైవేటు సంస్థల్లోని 100 ఉద్యోగాల భర్తీకి ఈ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎస్ఎస్సీ, ఇంటర్మీడియేట్, డిగ్రీ అర్హత కలిగి ఉండి 18 ఏళ్లు పైబడిన వారు అర్హులన్నారు. ఎంపికైన వారికి వారి విద్యార్హత నైపుణ్యాన్ని అనుసరించి చక్కటి జీతభత్యాలతో పాటు ఇతర ఇన్సెంటీవ్స్ ఉంటాయన్నారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు శుక్రవారం ఉదయం 10:30 గంటలకు విజయనగర్ కాలనీలోని హైదరాబాద్ జిల్లా ఉపాధి కార్యాలయంలో ఫొటోలు, సర్టిఫికెట్లతో హాజరుకావాలన్నారు. ఇతర వివరాలకు 83284 28933లో సంప్రదించవచ్చు.

11న బొటానికల్ గార్డెన్‌లో బర్డ్ వాక్

గచ్చిబౌలి: తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థ (టీజీఎఫ్‌డీసీ) దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని ఈ నెల 11న బొటానికల్ గార్డెన్‌లో బర్డ్ వాక్ నిర్వహిస్తున్నట్లు టీజీఎఫ్‌డీసీ ఎకో టూరిజం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రంజిత్ నాయక్ తెలిపారు. ఉదయం 6 గంటల నుంచి ఉదయం 9 గంటల వరకు బర్డ్ వాక్ కొనసాగుతుందన్నారు ఈ కార్యక్రమంలో పక్షుల జాతులను గుర్తించడం, ఏ పక్షులు ఏ వాతావరణంలో, ఏ రకమైన వృక్షాలపై గూళ్లు కడతాయి, ఎలాంటి ఆహారం తీసుకుంటాయి, ఎలా కదులుతాయి, వాటి ప్రవర్తన ఉంటుందో పక్షి నిపుణులు వివరిస్తారని పేర్కొన్నారు. బర్డ్ వాక్ రావాలనుకునే వారు 9885298980, 7382307476 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

ఒకేషనల్ స్టడీస్ విభాగం వెబ్‌పేజీ ఆవిష్కరణ



రాయదుర్గం: ఉపాధి పొందగల నైపుణ్యం కలిగిన సాంకేతిక ఆరోగ్య కార్యకర్తలను సృష్టించడమే లక్ష్యమని మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్ పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని ఉర్దూ విశ్వవిద్యాలయంలో స్కూల్ ఆఫ్ సైన్సెస్ కింద వృత్తి అధ్యయనాలు, నైపుణ్య అభివృద్ధి విభాగాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఒకేషనల్ స్టడీస్ విభాగం వెబ్‌పేజీని అధికారికంగా ప్రారంభించారు.

కళాశాలల్లో తెలుగును తప్పనిసరి చేయాలి

సుల్తాన్‌బజార్: నానాటికి విద్యారంగంలో మాతృభాషపై నిరాదరణ, ఆంగ్ల ఆధిపత్యం పెరిగిపోతున్న నేపథ్యంలో 82 ఏళ్ల కింద మాతృభాష తెలుగు పరిరక్షణే ప్రథమ కర్తవ్యంగా ఆవిర్భవించిన తెలంగాణ సారస్వత పరిషత్ అధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి అధ్యక్షతన గురువారం ప్రత్యేక సమావేశం నిర్వహించి పలు తీర్మానాలు ఆమోదించింది. ఇంటర్మీడియెట్‌లో సంస్కృతాన్ని ప్రవేశపెట్టాలన్న ప్రతిపాదనను విరమించుకోవడమే కాకుండా ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కళాశాలల్లో తెలుగును తప్పనిసరి చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 10వ తరగతి వరకు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో తెలుగును తప్పనిసరి అధ్యయనాంశంగా జీఓ నెంబరు:15 ప్రకారం కచ్చితంగా అమలు చేస్తున్నట్లే ఇంటర్‌లో కూడా తెలుగును తప్పనిసరి చేయాలని కోరింది. పరిషత్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జె.చెన్నయ్య సమన్వయ కర్తగా వ్యవహరించారు. ముదిగొండ సుజాతారెడ్డి, నరహరి, డాక్టర్ డి.చంద్రశేఖర్‌రెడ్డి, రామారావు, వసుంధర, కృష్ణమాచార్య, వెంకటయ్య, విష్ణువర్ధన్‌రెడ్డి, సిల్మానాయక్ పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

నాంపల్లి: పీడీఎస్ బియ్యాన్ని తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను మాసబ్‌ట్యాంక్ పోలీసులు పట్టుకున్నారు. వారి నుంచి 1800 బియ్యాన్ని, 405 కేజీల గోధుమలను స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం..బంజారాహిల్స్ రోడ్ నెం–12 గోలానగర్‌కు చెందిన మహ్మద్ యాసిర్(23), బిహార్‌కు చెందిన లలిత్‌కుమార్ (22) కాటేదాన్‌లో నివాసం ఉంటున్నాడు. ప్రజా పంపిణీకి చెందిన సన్న బియ్యం, గోధుమలను అక్రమంగా బంజారాహిల్స్ నుంచి కాటేదాన్‌కు తరలిస్తున్నారు. పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తుండగా బియ్యాన్ని, గోధుమలను స్వాధీనం చేసుకున్నారు. బియ్యాన్ని తరలిస్తున్న ఇద్దరిని అదుపులోకి తీసుకుని విచారించగా తాము పీడీఎస్ బియ్యాన్ని తరలిస్తున్నట్లుగా ఒప్పుకున్నారు. వారిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఉగ్రవాదం నిర్మూలించాలి.. పాకిస్తాన్ నశించాలి.!

- ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ
- సాయుధ దళాలకు సంఘీభావంగా ఆప్ ప్రదర్శన
- ఉగ్రవాద నిర్మూలనకు భారత్‌కు ప్రపంచ దేశాలు మద్దతివ్వాలి



లోయర్ ట్యాంక్‌బండ్‌పై అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ఆప్ శ్రేణులు

కవాడిగూడ: పాకిస్తాన్ భూభాగంలో ఉగ్రవాద స్థావరాలను నాశనం చేసిన భాత త్రివిధ దళాల ధైర్యానికి ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర కన్వీనర్ డా. దిడ్డి సుధాకర్ వందనాలు చెప్పారు. ప్రతి పౌరుడి విశ్వాసం 'ఆపరేషన్ సింధూర్' విజయమని అన్నారు. లోయర్ ట్యాంక్‌బండ్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద గురువారం ఆమ్ ఆద్మీ పార్టీ భారత సాయుధ దళాలకు సంఘీభావంగా ప్రదర్శన నిర్వహించింది. ఉగ్రవాదం నిర్మూలించాలి.. పాకిస్తాన్ నశించాలి.. భారత్ మాతాకీ జై అంటూ ఆప్ శ్రేణులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ దిడ్డి సుధాకర్ మాట్లాడుతూ పాకిస్తాన్‌లో పనిచేస్తున్న ఉగ్రవాద కర్మాగారాలను అంతం చేయడానికి కేంద్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలకు ఆప్ పూర్తి మద్దతు తెలుపుతుందని పేర్కొన్నారు. జాతీయ భద్రతపై ఎటువంటి రాజీపడొద్దన్నారు. ఈ సమయంలో రాజకీయ పార్టీలకు అతీతంగా అందరూ కేంద్ర ప్రభుత్వంతో నిలబడాలని విజ్ఞప్తి చేశారు. ఉగ్రవాదాన్ని నిర్మూలించడానికి ప్రయత్నిస్తున్న భారత దేశానికి ప్రపంచ దేశాలు మద్దతు ఇవ్వాలన్నారు. ఉగ్రవాద స్థావరాలను ఉగ్రవాదులను నాశనం చేయడానికి అన్ని దేశాలు భారతదేశంలో చేతులు కలిపి ప్రపంచంలో శాంతియుత వాతావరణం సృష్టించడానికి బలంగా కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆప్ నేతలు జావాద్ షరీఫ్, డాక్టర్ లక్ష్య నాయుడు, సుధారాణి, అజీజ్ బేగ్, షాబాజ్, లియాఖత్ ఖాన్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

సుందరయ్య పార్కులో భారత ప్రభుత్వానికి సెల్యూట్ చేస్తు ర్యాలీ నిర్వహిస్తున్న వాకర్స్



భారత సైన్యానికి సెల్యూట్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: పహల్గాంలో జరిగిన దాడికి ప్రతీకారంగా పాకిస్తాన్‌పై భారత ప్రభుత్వం, భారత సైన్యం 'ఆపరేషన్ సిందూర్' పేరుతో సాహసోపేతంగా సాగించిన దాడిని ప్రతి ఒక్కరూ హర్షిస్తున్నారు. సుందరయ్య పార్కులో వాకర్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సెంట్రల్ ప్రధాన కార్యదర్శి ఎస్. మనోహర్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం భారత సైన్యానికి సెల్యూట్ చేస్తు ర్యాలీ నిర్వహించారు. జాతీయ జెండాలు పట్టుకుని భారత ప్రభుత్వానికి, భారత సైన్యానికి జేజేలు పలుకుతూ పెద్ద ఎత్తున నినదించారు. ఈ సందర్భంగా వాకర్స్ ఇంటర్నేషనల్ మాజీ అధ్యక్షుడు వి.నాగభూషణం మాట్లాడుతూ.. గత నెల 22న పాకిస్తాన్ ఉగ్రవాదులు కశ్మీర్‌లో అమాయక పర్యాటకులపై సాగించిన మారణకాండను తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి ఎం.దశరథ్, మాజీ అధ్యక్షుడు ఎస్.మురళీకృష్ణ, సంపత్‌రెడ్డి, శైలజమోహన్, ఎస్.రమేష్‌రెడ్డి, అంబటి శ్రీనివాస్‌రెడ్డి, టి.స్కైలాబ్ బాబు, కోటా రమేష్, వివేక్, రాజశేఖర్‌రెడ్డి, రత్నాకర్‌రెడ్డి, జానివాకర్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆపరేషన్ అభ్యాస్

పౌర రక్షణ మాక్‌డ్రిల్‌పై విద్యార్థులకు అవగాహన

నల్లకుంట: పహల్గాం ఉగ్రదాడి తర్వాత భారత్ యుద్ధ సన్నద్ధం నేపథ్యంలో పౌరులను అప్రమత్తం చేసే దిశగా చర్యలు చేపట్టింది. దేశ సరిహద్దులో ఉద్రిక్త వాతావరణం నేపథ్యంలో ఎలాంటి పరిణామాలనైనా ఎదుర్కునేలా.. వైమానిక దాడులు జరిగినప్పుడు ప్రజలు పాటించాల్సిన జాగ్రత్తలను వివరించాలని కేంద్ర ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు ఏబీవీపీ విద్యానగర్ శాఖ ఆధ్వర్యంలో గురువారం విద్యానగర్‌లోని నారాయణ జూనియర్ కళాశాలలో మాక్‌డ్రిల్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వైమానిక దాడులు జరిగినప్పుడు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనే విషయాలను విద్యార్థులకు వివరించారు. విపత్తు వస్తే ఇళ్లు, అపార్ట్‌మెంట్లలోని ప్రజలు ఎక్కడి నుంచి బయట పడవచ్చు అనే అంశాలను మాక్‌డ్రిల్‌లో కళ్లకు కట్టినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ప్రణీత్, కార్యకర్తలు శృతి, మనోహర్, విద్యార్థులు పాల్గొన్నారు.



వైమానిక దాడులు జరిగినప్పుడు ఎలా వ్యవహరించాలనే దానిపై మాక్‌డ్రిల్

స్వచ్ఛ సర్వేక్షణ్ నామ్‌కే వాస్తేనే..!

జీహెచ్ఎంసీ అధికారులను నిలదీసిన పద్మాశాలి కాలనీవాసులు



శానిటైజేషన్ సూపర్‌వైజర్ గోవర్ధన్‌ను ప్రశ్నిస్తున్న పద్మశాలి కాలనీవాసులు

కవాడిగూడ: రోడ్లపై ఎక్కడ చూసినా చెత్తకుప్పలు, వ్యర్థాలు కనిపిస్తున్నాయని ఇదేనా స్వచ్ఛ సర్వేక్షణ్.? నామ్‌కే వాస్తేగా ప్రచారం చేస్తే ఎలా అని జీహెచ్ఎంసీ శానిటైజేషన్ అధికారులను పద్మశాలి కాలనీవాసులు నిలదీశారు. గురువారం పద్మశాలి కాలనీలో సచ్ఛ సర్వేక్షణ్‌పై కాలనీవాసులకు అవగాహన కల్పించేందుకు శానిటైజేషన్ సూపర్‌వైజర్ గోవర్ధన్, ఎస్ఎఫ్ఏలు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఈ సందర్భంగా కాలనీవాసులతో వారు మాట్లాడుతూ.. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని.. రోడ్లపై చెత్త వేయొద్దని సూచించారు. అధికారుల మాటలు విన్న కాలనీవాసులు మాట్లాడుతూ.. స్వచ్ఛ సర్వేక్షణ్ అంటే ఏమిటీ అని నిలదీశారు. రోడ్లపై ఎక్కడ చూసినా చెత్తాచెదారం, చెత్తకుప్పలు కనిపిస్తున్నాయని.. వాటిని ఎప్పటికప్పుడు తొలగించరా అని ప్రశ్నించారు. గాంధీనగర్, పద్మశాలి కాలనీ, భోలక్‌పూర్, పార్శిగుట్ట తదితర ప్రాంతాలలో రోడ్లపై చెత్తాచెదారం కనిపిస్తోందని చెప్పారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌పై తమకు అవగాహన కల్పించడం కాదు ముందు కాలనీ రోడ్లపై ఉన్న చెత్తను ఎప్పటికప్పుడు తొలగించండని అధికారులకు సూచించారు. కాలనీ వాసులు అడిగే ప్రశ్నలకు అధికారులు సమాధానం చెప్పలేక మళ్లీ వస్తామంటూ వెనుదిరిగి వెళ్లిపోయారు.

మంత్రి పొన్నం ప్రభాకర్‌కు కృతజ్ఞతలు



మంత్రి పొన్నం ప్రభాకర్‌ను సన్మానిస్తున్న శ్రీనివాస్‌గౌడ్, బాలరాజ్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: బీసీలకు 42 శాతం రిజర్వేషన్ బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెట్టి అన్ని పార్టీల సంపూర్ణ మద్దతుతో కేంద్ర ప్రభుత్వానికి పంపేందుకు కృషి చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్‌కు గురువారం బీసీ సంక్షేమ సంఘం కృతజ్ఞతలు తెలిపింది. ఈ సందర్భంగా సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్, తెలంగాణ గౌడ కల్లుగీత సంఘాల సమన్వయ కమిటీ చైర్మన్ బాలగౌని బాలరాజ్‌గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ విజయకుమార్‌గౌడ్ ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... నిరంతరం రాష్ట్ర ప్రజలకు సేవ చేస్తూ ప్రజా నాయకుడిగా మంచి గుర్తింపు పొందారని అన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ కుల సంఘాల జేఏసీ నాయకులు గణేషాచారి, దుర్గయ్యగౌడ్, సింగం నగేష్‌గౌడ్, విక్రమ్‌గౌడ్, శేఖర్ సగర, కుల్కచర్ల శ్రీనివాస్‌గౌడ్, వేముల వెంకటేష్, మణిమంజరి తదితరులు పాల్గొన్నారు.

జలమండలి చేపట్టాల్సిన పనుల్లో వేగం పెంచండి



జలమండలి అధికారులతో అభివృద్ధిపై సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

అంబర్‌పేట: నియోజకవర్గంలో జలమండలి విభాగం చేపట్టాల్సిన పనుల్లో వేగం పెంచాలని ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ సూచించారు. గురువారం గోల్నాకలోని తన క్యాంపు కార్యాలయంలో అంబర్‌పేట డివిజన్ కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్‌తో కలిసి పలు అభివృద్ధి పనులపై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... నియోజకవర్గంలో తాగునీరు, డ్రైనేజీ పైపులైన వ్యవస్థను ఆధునీకరించడానికి సుమారు రూ.3కోట్ల నిధులు మంజూరు అయ్యాయని పేర్కొన్నారు. వాటితో ప్రతిపాదిత పనులు తక్షణమే చేపట్టేందుకు ప్రణాళిక సిద్ధం చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. నియోజకవర్గంలో ఐదు డివిజన్ల వారీగా పనులు చేపట్టి వేసవి ముగిసేలోగా పనులు పూర్తి చేయాలని ఆయన చెప్పారు. ఈ సమావేశంలో జలమండలి డీజీఎం విష్ణువర్ధన్‌రావు, ఏఈలు ఇతర సిబ్బంది ఉన్నారు.

గంజాయి విక్రయిస్తున్న యువకుడి అరెస్టు



పట్టుబడ్డ యువకుడు సుమిత్

అంబర్‌పేట: డబ్బులు సంపాదించేందుకు గంజాయి విక్రయించే మార్గాన్ని ఎంచుకున్న ఓ యువకుడిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ సంఘటన గురువారం అంబర్‌పేట పోలీసుస్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... బాగ్‌అంబర్‌పేట భరత్‌నగర్‌లో నివసించే భరత్ కుమారుడు సుమిత్(20) విద్యార్థి. ఇతడు సులువుగా డబ్బులు సంపాదించేందుకు గంజాయి విక్రయించాలని భావించి మహారాష్ట్రకు చెందిన అంజాద్‌ను సంప్రదించాడు. అంజాద్ వద్ద గంజాయి తీసుకుంటూ సుమిత్ తన స్నేహితులు, తెలిసిన వారికి విక్రయిస్తున్నాడు. అందులో భాగంగా ఈనెల 7న అంబర్‌పేట మున్సిపల్ గ్రౌండ్ వద్ద గంజాయి విక్రయించేందుకు యత్నించాడు. సమాచారం అందుకున్న పోలీసులు అతడిని పట్టుకుని 600 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అతడి వద్ద కొనుగోలుకు ప్రయత్నించిన యువకులు నవీన్‌కుమార్, చందు, నిఖిల్ రాజ్, రణ్‌ధీర్ పరారయ్యారు. సుమిత్‌ను గురువారం పోలీసులు రిమాండ్‌కు తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఉద్యోగాల భర్తీ ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదే

ఉస్మానియా యూనివర్సిటీ: తెలంగాణ రాష్ట్రంలో వివిధ శాఖలలో ఉద్యోగాలను భర్తీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందని తెలంగాణ రీసెర్చ్ స్కాలర్స్ అసోసియేషన్ (టీజీఆర్ఎస్ఏ) అధ్యక్షులు పొన్నం ముత్యం గౌడ్ అన్నారు. గురువా రం రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ పుట్టినరోజు సందర్భంగా ఆర్ట్స్ కాలేజీ ఎదుట బర్త్‌డే కేక్‌ను కట్ చే సి విద్యార్థులకు పంచిపెట్టి మాట్లాడారు. బీఆర్ఎస్ పాలనలో నియామకాలలో జాప్యం చేసినందున నిరుద్యోగులు కేసీఆర్ ప్రభుత్వాన్ని గద్దెదింపారని పేర్కొన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు డా. కొండ నాగేశ్వర్‌రావు, దూడపాక సురేష్, సంతోష్, భగత్ చంద్ర, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వృద్ధుడి మృతి

నాంపల్లి: గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందిన ఘటన నాంపల్లి రైల్వేస్టేషన్ సమీపంలోని టూవీలర్ పార్కింగ్ వద్ద చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం..సుమారు 50–55 ఏళ్ల వయస్సు గల ఓ గుర్తుతెలియని వ్యక్తి గత కొన్నాళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. దీనికి తోడు వడదెబ్బ సోకింది. పరిస్థితి విషమించడంతో బుధవారం మధ్యాహ్నం మృతి చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించి భద్రపరిచారు. మృతుడి ఒంటిపై నీలం రంగు చొక్కా, అదే రంగు లుంగీ ధరించినట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సిబిల్ స్కోర్ నిబంధన ఎత్తివేయాలి

అడ్డగుట్ట: 'రాజీవ్ యువ వికాసం' పథకానికి సిబిల్ స్కోర్ నిబంధనను ఎత్తివేయాలని సీపీఐ సికింద్రాబాద్ కార్యదర్శి కాంపల్లి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. అడ్డగుట్టలోని పార్టీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆర్థికంగా వెనుకబడిన ఎస్సీ, ఎస్టీ, బీసీ యువతకు ప్రభుత్వం ఇస్తున్న రాజీవ్ యువ వికాసం సబ్సిడీ పథకానికి సిబిల్ స్కోర్ నిబంధన విధించడం అన్యాయమని అన్నారు. ప్రభుత్వం ఒకవైపు యువతకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించేందుకు సబ్సిడీ పథకాలను అర్హులైన వారికి వర్తింపజేస్తామని గొప్పలు చెబుతూ.. మరోవైపు సబ్సిడీ పథకానికి అనేక కొర్రీలు, షరతులు విధిస్తుందని ఆరోపించారు. ఈ పథకానికి ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాది మంది యువత దరఖాస్తు చేసుకున్నారని, ఇలాంటి తరుణంలో సిబిల్ స్కోర్ లాంటి నిబంధనను పెట్టడం యువత ఆశలపై నీళ్లు చల్లడమేనని పేర్కొన్నారు. సమావేశంలో సీపీఐ నాయకులు గౌరీ నాగరాజు, కొండల్, గౌస్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మెట్రో స్టేషన్‌లో యువకుడి ఆత్మహత్య

చిక్కడపల్లి: పురుగు మందు తాగి ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన చిక్కడపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని మెట్రో స్టేషన్‌లో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ రాజు నాయక్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. గురువారం చిక్కడపల్లి మెట్రోస్టేషన్‌కు వచ్చిన గుర్తు తెలియని యువకుడు అక్కడే వాంతులు చేసుకుని అపస్మారక స్థితికి చేరుకున్నాడు. దీనిని గుర్తించిన మెట్రో సిబ్బంది 108కు, పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు అతడిని గాంధీ ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. అతను పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు నిర్ధారించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సంజయ్ సింగ్వీ జీవితం ఆదర్శనీయం



మాస్‌లైన్ కేంద్ర కమిటీ సభ్యులు సంజయ్ సింగ్వీ సంతాప సభలో మాట్లాడుతున్న ప్రవీణ్ నడ్కర్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ కేంద్ర కమిటీ సభ్యులు, టీయూసీఐ ఆల్ ఇండియా ప్రధాన కార్యదర్శి సంజయ్ సింగ్వీ జీవితం ఆదర్శనీయమని మాస్‌లైన్ కేంద్ర కమిటీ సభ్యులు ప్రవీణ్ నడ్కర్ అన్నారు. గురువారం విద్యానగర్‌లోని మార్క్స్ భవన్‌లో సంజయ్ సింగ్వీ సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రవీణ్ నడ్కర్ మాట్లాడుతూ... కార్మిక వర్గ శ్రేయస్సు కోసం అలుపెరుగని పోరాటం చేసిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. సమసమాజ స్థాపనే ధ్యేయంగా ఆయన చేసిన కృషి ఆదర్శనీయమని కొనియాడారు. ఆయన చేసిన పోరాటాన్ని స్ఫూర్తిగా తీసుకొని ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. మాస్ లైన్ కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.హన్మేష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కేంద్ర కమిటీ సభ్యులు కేజీ రామచందర్, కార్యవర్గ సభ్యులు కెచ్చెల రంగయ్య, వి.కృష్ణ, ప్రభాకర్, కె.సూర్యం, ఎస్ఎల్.పద్మ, సదానందం, కె.ఎస్ ప్రదీప్, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

నర్తకి కోకా విజయలక్ష్మికి ఆహ్వానం



నృత్య కళాకారిణి కోకా విజయలక్ష్మి బృందం

చిక్కడపల్లి: మలేషియా తెలుగు అసోసియేషన్ ఆధ్వర్యంలో రవాంగ్‌నగర్‌లో నిర్వహించే ఉగాది ఉత్సవాల్లో పాల్గొనేందుకు ప్రముఖ నృత్య కళాకారిణి కోకా విజయలక్ష్మికి ఆహ్వానం అందింది. ఈ మేరకు ఆమె గురువారం చిక్కడపల్లిలో మాట్లాడుతూ... తన బృందంలోని సభ్యులు రవి, మధుమతి కులకర్ణి, డి.కీర్తన, నిఖిలాస, సాయి నిహారిక మే 10 నుంచి నాలుగు రోజుల పాటు మలేషియాలో నృత్య ప్రదర్శనలు ఇస్తామన్నారు. ఈ ఉత్సవాలలో భాగంగా కూచిపూడి శైలిలో నృత్యరూపకాన్ని తెలుగు సంస్కృతిని ప్రతిబింబించే విధంగా నృత్య ప్రదర్శనలు చేస్తామని తెలిపారు.

'ప్రజా తిరంగ్ యాత్ర' పోస్టర్ ఆవిష్కరణ



ప్రజా తిరంగ్ యాత్ర పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అమానగంటి సైదులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: భద్రాచలం నుంచి హైద్రాబాద్ వరకు ప్రజా తిరంగ్ యాత్రకు ఈనెల 26న నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా యాత్రకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను సామాజిక తెలంగాణ పార్టీ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు అమానగంటి సైదులు గురువారం సుందరయ్య విజ్ఞాన కేంద్రం వద్ద ఆవిష్కరించారు. అనంతరం సైదులు మాట్లాడుతూ... అటూ తెలంగాణ ప్రజల పక్షాన.. ఇటు ప్రభుత్వం పక్షాన.. రాష్ట్ర అభివృద్ధిని కోరుతూ జరిగే యాత్రకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. తెలంగాణ రాష్ట్రంలోని సమస్యలు తెలుసుకుంటూ ఉపాధి విద్య, ఉద్యోగం , రాజ్యాధికారం దిశగా ప్రజలను చైతన్యం చేస్తూ ఈ యాత్ర భద్రాచలం నుంచి సూర్యాపేట, జనగాం , భువనగిరి, ఘట్‌కేసర్, ఉప్పల్ రింగ్ రోడ్డు వద్ద యాత్ర ముగుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రజాఫ్రంట్ నాయకులు కడమంచి రాంబాబు, సినిమా డైరెక్టర్ శ్రీపాద రామచంద్రరావు, ముస్తఫా తదితరులు పాల్గొన్నారు.

రాజీవ్ యువ వికాసం పథకానికి సిబిల్ నిబంధనను తొలగించాలి

హిమాయత్‌నగర్: రాజీవ్ యువ వికాసం పథకానికి సిబిల్ స్కోర్ నిబంధన సరికాదని అఖిల భారత యువజన సమాఖ్య(ఏఐవైఎఫ్) రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శిలు వలిఉల్లా ఖాద్రీ, కల్లూరు ధర్మేంద్ర అన్నారు. సిబిల్ స్కోర్ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ గురువారం హిమాయత్‌నగర్‌లోని సత్యనారాయణ రెడ్డి భవన్ నుంచి వై జంక్షన్ వరకు చెవిలో పూలు, చేతిలో చిప్ప పట్టుకుని వినూత్నంగా ధర్నా నిర్వహించారు. సిబిల్ నిబంధన నిర్ణయం వెంటనే వెనక్కి తీసుకోవాలని లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఏఐవైఎఫ్ నేతలు నెర్లకంటిశ్రీకాంత్, టి.సత్యప్రసాద్, షేక్ మహమూద్, మాజీద్ అలీఖాన్, హేమంత్, జానీ, వెంకట్, ఖాజా పాషా, సతీశ్ కుమార్, జగన్, సీపీఐ నేత చెట్టుకింది శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

'సాక్షి ఎడిటర్ ఇంట్లో పోలీసుల తనిఖీలు అమానుషం'

తీవ్రంగా ఖండించిన టీడబ్ల్యూజేఎఫ్ నేతలు

బన్సీలాల్‌పేట్: సాక్షి దినపత్రిక ఎడిటర్ ధనుంజయరెడ్డి ఇంట్లో ఏపీ పోలీసుల తనిఖీలు చేయడాన్ని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) నాయకులు తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి. బసవపున్నయ్య, రాష్ట్ర కార్యదర్శి ఇ. చంద్రశేఖర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు బి. రాజశేఖర్, నవీన్, నిరంజన్, రఘు, దామోదర్ తదితరులు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఎంతో బాధ్యతగల పత్రికా ఎడిటర్ ఇంట్లో పోలీసులు తనిఖీలు చేయడం సరికాదన్నారు. నిబంధనలు, ప్రజాస్వామ్య పద్ధతులకు తిలోదకాలిస్తూ జర్నలిస్టులను భయభ్రాంతులకు గురి చేసే విధంగా పోలీసులు వ్యవహరించడం అమానుషమన్నారు. పత్రికా స్వేచ్ఛను హరించే విధంగా జర్నలిస్టులను భయపెట్టాలనే ఉద్దేశంతో ఏపీ పోలీసులు ఈ విధంగా చట్టానికి విరుద్ధంగా వ్యవహరించడాన్ని ఖండిస్తున్నామన్నారు. సాక్షి ఎడిటర్ ధనుంజయరెడ్డిపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తి వేయాలని తాము ఇప్పటికే ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాకు ఫిర్యాదు చేశామని గుర్తు చేశారు. ఏపీ ప్రభుత్వం పత్రికా స్వేచ్ఛను కాపాడాలని జర్నలిస్టులను భయపెట్టే విధానాలకు స్వస్తి చెప్పాలని కోరారు.

ఎడిటర్ ఇంట్లో తనిఖీలు అప్రజాస్వామికం

ఉస్మానియా యూనివర్సిటీ: సాక్షి దినపత్రిక ఎడిటర్ ధనుంజయ్ రెడ్డి నివాసంపై పోలీసులు దాడి చేయడాన్ని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగం గౌడ్ గురువారం ఖండించారు. ముందస్తుగా ఎలాంటి నోటీసులు లేకుండా దౌర్జన్యంగా పోలీసులు ఇంట్లోకి చొరబడి తనిఖీలు చేయడం అప్రజాస్వామికమన్నారు. పత్రికా స్వేచ్ఛకు విఘాతం కల్గించడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. ఏపీలో అధికారంలో ఉన్న టీడీపీ సాక్షి ఎడిటర్ పై కక్ష సాధింపు చర్యలు మానుకోవాలని హెచ్చరించారు. లేని పక్షంలో హైదరాబాద్‌లోని కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.